సాక్షి అనంతపురం

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.24,310

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24,310 పలికాయి.



టమాట కిలో రూ.11

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.11 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా శనివారం చలి వాతావరణం నెలకొంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఫైనాన్స్ కంపెనీలో భారీగా బంగారం మాయం

- మేనేజర్‌పై అనుమానం



ఉరవకొండ: పట్టణంలోని ఓ ప్రముఖ గోల్డ్ లోన్ ఫైనాన్స్ కంపెనీలో భారీగా బంగారం మాయమవడం చర్చనీయాంశమైంది. తాకట్టు పెట్టిన బంగారు నగలు కనిపించకపోవడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, సదరు ఫైనాన్స్ కంపెనీ బ్రాంచి మేనేజరే నగలను కాజేశాడనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై గోల్డ్ లోన్ ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది ప్రధాన కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో అక్కడి నుంచి ఆడిటర్లు ఉరవకొండకు చేరుకుని ఆరా తీశారు. దాదాపు కేజీ పైగా బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయినట్లు గుర్తించారు. శనివారం ఉరవకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది విచారణ చేపట్టారు. ఫైనాన్స్ కంపెనీ ఆడిటర్ల నుంచి వివరాలు సేకరించారు. సదరు ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్ మేనేజర్ తన సొంత అవసరాలకు బంగారు ఆభరణాలను మరో చోట తాకట్టు పెట్టి డబ్బు తీసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నట్లు తెలిపారు.

రేషన్ దుకాణాలకు 'గాలి ప్యాకెట్లు'



ఖాళీ కందిబేడల ప్యాకెట్‌ను చూపుతున్న డీఎం రమేష్ రెడ్డి

తాడిపత్రి రూరల్: కూటమి ప్రభుత్వంలో ఇదో వింత. రేషన్ దుకాణాలకు కంది బేడల ప్యాకెట్లను సరఫరా చేయాల్సి ఉండగా, కేవలం కవర్‌లో గాలిని నింపి పంపించారు. మండలంలోని చిన్నపొలమడ వద్ద గల రైస్ గోడౌన్‌ను శనివారం పౌరసరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొందరు డీలర్లు తమకు కందిబేడల స్థానంలో గాలితో నిండిన ప్యాకెట్లు సరఫరా చేశారని డీఎం దృష్టికి తీసుకెళ్లారు. గోడౌన్ అధికారులకు చెబితే 'సర్దుకు పోండి' అంటూ ఉచిత సలహా ఇచ్చారని వాపోయారు. దీంతో గోడౌన్ సిబ్బందిపై డీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. గోడౌన్‌లో తూకాల్లో కూడా అక్రమాలకు పాల్పడుతున్నారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బియ్యం బస్తాలను గోడౌన్ నుంచి తీసుకెళ్లేటప్పుడు తప్పనిసరిగా తూకాలు వేసుకోవాలని డీలర్లకు సూచించారు.

సీఐ అనుచిత ప్రవర్తన.. గుండెపోటుతో సీనియర్ న్యాయవాది మృతి



బీవీ శేషాద్రి (ఫైల్)

అనంతపురం: సీఐ దుర్భాషలాడడంతో ఆందోళనకు గురైన సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈ ఘటన శనివారం రాత్రి అనంతపురంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలో సీనియర్ న్యాయవాదిగా ఉన్న బీవీ శేషాద్రిపై ఇటీవల ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఓ మహిళ సివిల్ వివాదానికి సంబంధించి ఫిర్యాదు చేసింది.ఈ ఫిర్యాదుపై విచారణ నిమిత్తం అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ శాంతిలాల్ శనివారం న్యాయవాది శేషాద్రిని స్టేషన్‌కు పిలిపించారు. తన చాంబర్‌లోనే ఆయన్ను అగౌరవపరుస్తూ పరుష పదజాలంతో దూషించారు. సీఐకి కొంత మంది పోలీసులు కూడా వంత పాడారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన శేషాద్రి అక్కడే కుప్పకూలారు. ఇంతకుముందే ఒకసారి గుండె ఆపరేషన్ జరిగిన ఆయనకు మరోసారి గుండెపోటు వచ్చింది. పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే శేషాద్రి మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

నిరసనకు పిలుపునిచ్చిన న్యాయవాదులు..

సీఐ శాంతిలాల్ దూషించడంతోనే శేషాద్రి గుండెపోటుకు గురై మృతి చెందారని న్యాయవాదులు పేర్కొన్నారు. సీఐని సస్పెండ్ చేయాలని, న్యాయవాది కుటుంబాన్ని ఆదుకోవాలనే ప్రధాన డిమాండ్‌తో ఆదివారం ఆందోళనలకు పిలుపునిచ్చారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించి.. సీఐ శాంతిలాల్‌ను సస్పెండ్ చేయాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

అదిరే.. అదిరే..



కాలం మారింది. అందుకు తగ్గట్లుగా పద్ధతులూ మారిపోయాయి. కొత్తకొత్త సంప్రదాయాలు పుట్టుకొచ్చాయి. ఇద్దరి మనసులను కలిపి ఒక్కటి చేసే వివాహమనే ఘట్టంలోనూ నూతన ఒరవడి ఒకటి పురుడుపోసుకుంది. అదే ప్రీ వెడ్డింగ్ షూట్. రూ. లక్షలు ఖర్చవుతున్నా యువత ఎక్కడా తగ్గడం లేదు. సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి కూడా సై అంటున్నారు. పిల్లలకు అడ్డు చెప్పలేక తల్లిదండ్రులు కూడా మిన్నకుండిపోతున్నారు.

పెళ్లి పుస్తకం.. కొత్త సంప్రదాయం!

- ప్రీ వెడ్డింగ్ షూట్ కొత్త పుంతలు
- నిశ్చితార్థం నుంచే లొకేషన్‌ల కోసం వెతుకులాట
- రూ.3 లక్షలైనా తగ్గేదే లేదంటున్న వైనం
- పిల్లల ఇష్టాయిష్టాలు కాదనలేకపోతున్న తలిదండ్రులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రీ వెడ్డింగ్ షూట్ కొత్త పుంతలు తొక్కుతోంది. ఇటీవల గ్రామీణ ప్రాంతాలకూ ఈ సంస్కృతి వ్యాపించింది. ఒకప్పుడు పెళ్లికి నాలుగు లక్షల రూపాయలైందంటేనే అంతా ఆశ్చర్యపోయేవారు. కానీ, నేడు ప్రీ వెడ్డింగ్ షూట్‌కే రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. పెళ్లికి ముందు ఏకంగా నాలుగైదు రోజుల పాటు పర్యాటక ప్రాంతాల్లోనే గడుపుతున్నారు. సంప్రదాయాలు అడ్డొస్తున్నా పిల్లల ఇష్టాయిష్టాలను కాదనలేక తల్లిదండ్రులు ఓకే చెబుతున్నారు.

నిశ్చితార్థం నుంచే..

గతంలో పెళ్లయ్యాక హనీమూన్‌కు ఎక్కడికెళ్లాలి అంటూ అందరితో ఆరా తీసేవారు. ఇప్పుడు నిశ్చితార్థం జరిగిన రోజు నుంచే ప్రీవెడ్డింగ్ షూట్‌కు అనువైన ప్రాంతాలను వెతుకుతుండటం గమనార్హం. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలు బెంగళూరుకు దగ్గరగా ఉండటంతో కర్ణాటకలోని పర్యాటక ప్రదేశాలనూ ఇంటర్నెట్‌లో చూస్తున్నారు.

గండికోటకు క్యూ..

ఎక్కువ జంటలు చారిత్రక కట్టడాలను ప్రీవెడ్డింగ్ షూట్‌కు ఎంపిక చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో చాలా మందికి నచ్చుతున్న వేదికల్లో గండికోట మొదటి వరుసలో ఉంటోంది. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని గండికోట రాజసానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇటీవల ఆ ప్రాంతానికి ప్రీ వెడ్డింగ్ షూట్‌కు వెళ్తున్న జంటలు ఎక్కువయ్యాయి. ఆ తర్వాత కర్ణాటకలోని నందిహిల్స్, కూర్గ్, మైసూరు, గోవాతో పాటు బాగా డబ్బున్న వారైతే జైపూర్‌కు వెళుతున్నారు.

రెండు నుంచి మూడు లక్షలు..

ఒకేరోజులో అంటే ప్రీ వెడ్డింగ్ షూట్ అయ్యేది కాదు. రెండు, మూడు రోజులు అక్కడే ఉండాల్సి వస్తోంది. ప్రత్యేకంగా ఓ కెమెరా మెన్ లేదా ఒక ఫొటోగ్రాఫర్‌ను వెంట తీసుకెళ్లాలి. ఈ క్రమంలో కెమెరామెన్, ఫొటోగ్రాఫర్లకే రూ.1.50 లక్షల వరకూ ముట్టజెబుతున్నారు. బస, ఆహారం, దుస్తుల కొనుగోలు తదితర వాటికి మరో లక్ష రూపాయల పైనే ఖర్చవుతోంది. ఈ మూడు రోజుల ప్రక్రియను ఎడిట్ చేసి పెళ్లినాడు ప్రదర్శిస్తున్నారు. పెళ్లి ఖర్చులకు ఇదంతా అదనం కావడం గమనార్హం.

సీజన్‌లో ఫుల్ బిజీ



ప్రీ వెడ్డింగ్ షూట్ సంస్కృతి బాగా పెరిగింది. రెండు నుంచి మూడు రోజులు జంట వెంటే ఉండి ఫొటోలు తీస్తాం. ఎడిటింగ్, ఆల్బం అన్నీ కలిపి కనిష్టంగా రూ.60 వేలు తీసుకుంటాం. ఎక్కువమంది బెంగళూరులోని రిసార్ట్స్‌ను ఎంపిక చేసుకుంటున్నారు. పెళ్లిళ్ల సీజన్‌లో ప్రీ వెడ్డింగ్ షూటింగ్‌ల కోసం చాలా బిజీగా ఉంటాం.
–వాల్మీకి బాసంతి, ఫొటోగ్రాఫర్/కాన్సెప్ట్ ఆర్టిస్ట్

ఒకరినొకరు తెలుసుకోవచ్చు..



ఒకరి మనసు మరొకరు తెలుసుకునేందుకు ప్రీ వెడ్డింగ్ షూట్ ఎంతో ఉపయోగపడుతుంది. మా స్నేహితులు, బంధువులు ఎంతో ఆడంబరంగా ఈ వేడుక జరుపుకున్నారు. సమయాభావం వల్ల మేం మిస్ అయ్యాం.
– పాండ్రే వైష్ణవి, బ్యాంకు ఉద్యోగి

మార్పును అంగీకరించక తప్పదు



ఇటీవల వివాహ తంతులో ప్రవేశించిన పాశ్చాత్య విషయాలు శాస్త్ర విరుద్ధమైనప్పటికీ అంగీకరించక తప్పడం లేదు. మారుతున్న కాలంలో అన్ని పద్ధతులతో పాటు వివాహ విషయాల్లో కూడా చాలా వరకు మార్పులు చోటుచేసుకుంటున్నాయి. జాగ్రత్తలు తీసుకుంటే ప్రీ వెడ్డింగ్ షూట్‌తో ఇబ్బంది ఉండదు.
– బాలాజీ శర్మ, వేద పండితులు, అనంతపురం



జిల్లాలో పెళ్లిళ్ల వివరాలు..

ఏటా జరుగుతున్న పెళ్లిళ్లు
30,000 వరకు

ప్రీ వెడ్డింగ్ షూట్‌కు వెళుతున్న జంటలు
6,000 పైనే

సగటున ప్రీవెడ్డింగ్ షూట్ వ్యయం
రూ. 2,00,000

రవాణా, దుస్తులు తదితరాల ఖర్చు
రూ. 50 వేల నుంచి లక్ష

సమన్వయంతో పని చేద్దాం

- జెడ్పీ నూతన సీఈఓకి చైర్‌పర్సన్ గిరిజమ్మ సూచన



జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఈఓ రామచంద్రారెడ్డి

అనంతపురం సిటీ: ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లా అభివృద్ధికి పాటుపడదామని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి (సీఈఓ)గా నియమితులైన రాజోలి రామచంద్రారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అంతకుముందు నూతన సీఈఓకు జిల్లా పరిషత్ ఉద్యోగులు స్వాగతం పలికారు. డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్యతో పాటు ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సీఈఓ నేపథ్యం ఇలా..

వైఎస్సార్ జిల్లా ముద్దనూరు మండలానికి చెందిన రాజోలి రామచంద్రారెడ్డి 1996లో గ్రూప్–2లో ప్రతిభ కనబరిచి ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. 1996లో తొండూరు ఈఓపీఆర్‌డీగా నియమితులయ్యారు. ఆ తరువాత ఎంపీడీఓగా అదే జిల్లాలోని చాపాడు, ప్రొద్దుటూరు, రాజుపాళెం, చింతకొమ్మదిన్నె మండలాల్లో పని చేశారు. 2019 నుంచి 2023 వరకు కడపలో డ్వామా ఏపీడీగా విధులు నిర్వర్తించారు. అనంతరం నంద్యాల జిల్లా డ్వామా పీడీగా నియమితులయ్యారు. అక్కడి నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా జెడ్పీ సీఈఓగా బదిలీపై వచ్చారు.

కూటమి సర్కారు కక్ష సాధింపు

- మాజీ ఎమ్మెల్యే విశ్వతో సహా 16 మందిపై కేసులు
- ఆర్థిక మంత్రి కేశవ్ ఇలాకాలో పోలీసుల పక్షపాతం



నిరసన ర్యాలీ అనంతరం విద్యుత్ శాఖ ఏడీకి వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపిన వైఎస్సార్ సీపీ నేతలపై కూటమి సర్కారు కక్ష సాధింపు చర్యలకు దిగింది. ఉరవకొండ నియోజకవర్గంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఒత్తిడితో పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తూ వైఎస్సార్ సీపీ నేతలపై కేసులు నమోదు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 27న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. స్థానిక ఉరగాద్రి కల్యాణ మండపం నుంచి విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయం వరకు నిర్వహించిన 'విద్యుత్ పోరుబాట' ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి.

విశేష స్పందనను జీర్ణించుకోలేక..: 'విశ్వ' ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి ప్రజల నుంచి కూడా విశేష స్పందన లభించింది. దీన్ని జీర్ణించుకోలేని 'పచ్చ' నేతలు పోలీసులపై ఒత్తిడి తెచ్చి అక్రమ కేసులు బనాయించడం గమనార్హం. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి, ప్రజలు ఇబ్బంది పడేలా చేశారని ఓ టీడీపీ నేత ఇచ్చిన ఫిర్యాదు, విధులకు ఆటంకం కలిగించారంటూ ఏడీ భాస్కర్ చేసిన మరో ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే విశ్వతో పాటు మరో 16 మంది పార్టీ ముఖ్య నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఏకపక్షంగా.. : అధికార పార్టీ నేతలకు జీ హుజూర్ అంటూ వారు చెప్పినట్లల్లా వ్యవహరిస్తున్న ఉరవకొండ పోలీసులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులను వేధింపులకు గురి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. 'పోరుబాట' ర్యాలీ సందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకపోయినా.. ఓ టీడీపీ నేత ఫిర్యాదు చేయగానే కేసు నమోదు చేశారంటే పోలీసుల పని తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉరవకొండలో గత రెండు నెలల వ్యవధిలోనే 20కు పైగా చోరీలు జరిగాయి. వీటిలో ఇప్పటి వరకూ పోలీసులు కనీస పురోగతి సాధించలేకపోయారు. పట్టపగలే దొంగలు సవాల్ విసురుతున్నా మొద్దు నిద్రపోతున్నారు. దీంతో పాటు నియోజకవర్గంలో విచ్చలవిడిగా మట్కా, పేకాటతో పాటు బియ్యం, ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. ఇక.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు జరిగాయి. పోలీసుల సమక్షంలోనే 'పచ్చ' మూకలు రెచ్చిపోయి దాడులకు దిగాయి. కొందరు వైఎస్సార్ సీపీ నేతల ఇళ్లల్లోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. ఉరవకొండలో కొంతమంది వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులతో బలవంతంగా పార్టీకి రాజీనామా చేయించాలని చూస్తున్నారు. ఇంత జరుగుతున్నా స్పందించని పోలీసులు.. వైఎస్సార్‌సీపీ నాయకులను ఇబ్బందులకు గురి చేయడంలో మాత్రం ఉత్సాహం చూపుతుండటం గమనార్హం.

అక్రమ కేసులకు భయపడేది లేదు

మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు ఉరవకొండ పోలీసులు, అధికార యంత్రాంగం పనిచేస్తుండటం సిగ్గుచేటు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ర్యాలీ చేసినా మంత్రి కేశవ్ జీర్ణించుకోలేకపోతున్నారు. నాతో పాటు పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటాం. కూటమి నేతల దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తాం. పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉంటాం.
– విశ్వేశ్వర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

రెవెన్యూ సదస్సు.. తుస్సు

- ఇప్పటి వరకు 328 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు
- ఫిర్యాదులు వేలల్లో ఉంటే, పరిష్కారం వందల్లోనే



రాప్తాడు మండలం హంపాపురం గ్రామంలో నిర్వహించిన సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు విజయకుమారి, అధికారులు


అనంతపురం అర్బన్: జిల్లా రెవెన్యూ శాఖ ఆర్భాటంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో ఎలాంటి ఫలితం లేకుండా పోతోంది. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులకు పరిష్కారం కానరావడం లేదు. జిల్లాలో ఇప్పటివరకూ జరిగిన సదస్సులు, అందిన వినతులు, పరిష్కార తీరును పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది.

భారీగా ఫిర్యాదులు..

జిల్లావ్యాప్తంగా ఈ నెల 6న రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. అధికారిక నివేదిక ప్రకారం మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో మొత్తం 503 గ్రామాలకు గానూ ఈనెల 27వ తేదీ వరకు 328 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. వీటికి 31,102 మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలపై 5,056 ఫిర్యాదులు అందగా, 287 పరిష్కరించారు.

- కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలో 151 గ్రామాలకు గానూ 125 గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాయి. 12,904 మంది ప్రజలు హాజరయ్యారు. సదస్సుల్లో 1,249 ఫిర్యాదులు రాగా 146 పరిష్కరించారు.
- అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 198 గ్రామాలకు గానూ 134 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. 9,325 మంది ప్రజలు హాజరయ్యారు. సదస్సుల్లో 1,990 ఫిర్యాదులు రాగా 71 పరిష్కరించారు.
- గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో 154 గ్రామాలకు గానూ 98 గ్రామాల్లో సదస్సులు జరిగాయి. 8,873 మంది ప్రజలు హాజరయ్యారు. సదస్సుల్లో 1,817 ఫిర్యాదులు రాగా, 79 పరిష్కరించారు.

ఈ- కేవైసీ వేగవంతం చేయండి



సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

శింగనమల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)కు సంబంధించి రికార్డుల కంప్యూటరైజేషన్‌తోపాటు రైతుల ఈ–కేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆమె సోదనపల్లి, నిదనవాడ గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈకేవైసీ ప్రక్రియలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఈఓఆర్‌డీ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు నాగర్జున, మహబూబ్ బాషా ఉన్నారు.

ఫీజు బకాయిలపై ఉద్యమం

- ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 30న విజయవాడలో నిరసన దీక్ష



ఐక్యత చాటుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ ఐక్య విద్యార్థి సంఘాలు పోరుబాట పట్టనున్నాయి. ఇందులో భాగంగా ఈనెల 30న విజయవాడలో దీక్ష చేపట్టనున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు వెల్లడించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యనుమల నరేష్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, ఏఐఎస్‌ఏ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతరాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ. 3,580 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన బకాయిలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నాయన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ తదితర కోర్సులు పూర్తి చేసుకున్నా సర్టిఫికెట్లు ఇవ్వకుండా మెలిక పెడుతున్నారన్నారు. డబ్బులు చెల్లిస్తేనే విద్యార్థులకు పరీక్షలకు అనుమతిస్తామని యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు రాలేదనే అవమానంతో ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే బకాయి డబ్బులు చెల్లిస్తుందంటూ పేపర్ ప్రకటనలు ఇస్తున్నా విద్యాసంస్థల యాజమాన్యాలు ఏమాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఈ నెల 30న జరిగే నిరసన దీక్షకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఆంజనేయులు, వంశీ, మంజునాథ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చైతన్య, గిరి, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు కైలాష్, శారిక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మామిడిలో సస్యరక్షణ అవసరం

• ఉద్యానశాఖ డీడీ జి.చంద్రశేఖర్



అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల కురిసిన వర్షాలు, నెలకొన్న వాతావరణ పరిస్థితులు కారణంగా పూత వచ్చే కీలకదశలో ఉన్న మామిడితోటల మంచి దిగుబడులు రావాలంటే సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేసుకోవాలని సత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్ సూచించారు. పూత, మొగ్గలు తొందరగా, ఒకేసారి రావాలంటే 7 గ్రాములు 13-0-45 + 2 నుంచి 3 గ్రాములు ఏదైనా సూక్ష్మధాతువు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఇదివరకే ఈ మందు పిచికారీ చేసిన రైతులు 3 గ్రాములు 0-0-50 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. తేనే మంచు పురుగు ఉన్నట్లు గమనిస్తే 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల బూడిద తెగులు సోకే అవకాశం ఉందన్నారు. వర్షాలు ఆగిపోవడం, చలి వాతావరణం వల్ల పూమొగ్గలపై మంచు ఏర్పడి పూత నల్లగా మారి పిందె ఏర్పడకుండా రాలిపోయే పరిస్థితి ఉంటుందని తెలిపారు. నివారణకు 2 మి.లీ హెక్సాకొనజోల్ లేదా 1 గ్రాము థయోమిథాక్సామ్ + 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. జనవరి మొదటి వారం వరకు పూమొగ్గలు రాకుంటే ఒకసారి తేలికపాటి నీటి తడి ఇవ్వాలన్నారు. డ్రిప్ సదుపాయం ఉన్న తోటలకు 0-0-50 నీటిలో కరిగే ఎరువును 2.50 కిలోల నుంచి 3 కిలోలు ఎకరాకు డ్రిప్ ద్వారా వదులుకోవాలని సూచించారు. కీలకదశలో ఉన్న మామిడిలో మంచి దిగుబడుల కోసం రైతులు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.

నాడు



అనంతపురం రూరల్ మండలం కేకేకాలనీలో గత ప్రభుత్వం కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దిన పాఠశాల భవనం

గత ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడులను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దారు. ఇంగ్లిష్‌మీడియం తోపాటు టోఫెల్, ఐబీ సిలబస్‌ను ప్రవేశపెట్టారు. ఐఎఫ్‌పీ ప్యానెళ్లతో విద్యాబోధనలో నూతన ఒరవడి సృష్టించారు. అమ్మఒడి ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం జమ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెనతో పేద విద్యార్థులకు అండగా నిలిచారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి పూర్తిగా మారి పోయింది. నాడు–నేడు పనులు నిధులు లేక ఆగిపోయాయి. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం కింద ఇస్తామన్న డబ్బూ ఇవ్వలేదు. గత ప్రభుత్వం వెలుగులు పంచితే ఈ ప్రభుత్వం తమను చీకట్లోకి నెట్టిందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. కొత్త సంవత్సరంలోనైనా తమకు మేలు జరుగుతుందేమోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.



విద్యా వెలుగులు

కమ్ముకున్న చీకట్లు



నేడు



కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులో ఆగిన ఉన్నత పాఠశాల భవన నిర్మాణం

- 2024లో 'అమ్మఒడి' లేదు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోయే
- పర్యవేక్షకులు లేక కుంటుపడిన 'సమగ్ర' పథకాలు
- ఫీజు బకాయిలు చెల్లించాలంటూ కళాశాల యాజమాన్యాల ఒత్తిళ్లు
- నిధులు విడుదల చేయని కూటమి సర్కారు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ సాయంతో చదువుకుంటున్న పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఈ ఏడాది (2024) చేదు జ్ఞాపకాలనే మిగిల్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేదు. 'తల్లికి వందనం' కోసం తల్లులు ఎదురు చూస్తున్నారు. అంతకుముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏటా ఏ ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ తదితర కోర్సుల విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన (ఫీజు రీయింబర్స్‌మెంట్) అమలు చేసింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా కోర్సు ఏదైనా, ఫీజు మొత్తం ప్రభుత్వమే ఏడాదిలో నాలుగు విడతలుగా చెల్లిస్తూ వచ్చింది. అలాగే పట్టణాలు, నగరాల్లో హాస్టళ్లు, ప్రైవేట్ అద్దె గదుల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు 'వసతి దీవెన'తో అండగా నిలిచింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నాయి. ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులు పెట్టొద్దనే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలను ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ఎప్పుడిస్తుందో తెలీదు...కళాశాలల నిర్వహణ చాలా ఇబ్బందిగా ఉందంటూ యాజమాన్యాలు చెబుతున్నాయి. జిల్లాలో దాదాపు 42 వేల మంది విద్యార్థులకు రూ. 90.10 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పు బకాయిలున్నాయి.



2024 రౌండప్

విద్యారంగంలో పథకాలకు వెచ్చించిన నిధులు(రూ.కోట్లలో)

పథకం	గత ప్రభుత్వంలో	ఈ ప్రభుత్వంలో
అమ్మ ఒడి	1718.89	00
మనబడి నాడు–నేడు	391	00
ట్యాబ్స్	140.64	00
స్మార్ట్ టీవీలు	5.33	00
ఐఎఫ్‌పీలు	20.84	00

'తల్లికి వందనం' కోసం తప్పని ఎదురుచూపులు

పేద వర్గాల పిల్లలు నిరక్షరాస్యులుగా మిగిలిపోకూడదని, డ్రాపౌట్స్‌గా మారకూడదనే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లులను ప్రోత్సహించారు. ఈ క్రమంలో 'అమ్మఒడి' అమ్మ ఒడి అమలు చేశారు. 1 నుంచి ఇంటర్ చదువుకునే విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖతాల్లో ఏటా రూ.15 వేలు జమ చేశారు. జిల్లాలో మొత్తం 11,74,374 మంది తల్లులకు అక్షరాలా రూ.1,718.89 కోట్లు అందించారు. ఈఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై ఆర్నెళ్లు దాటుతున్నా 'తల్లికి వందనం' ఊసేలేదు. ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఒక్కొక్కరికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. ఈ సొమ్ము కోసం తల్లులు ఎదురుచూస్తున్నారు.

పర్యవేక్షణ కరువు..

ఈ ఏడాదిలోనే జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి బదిలీ అయ్యారు. సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాద్‌రావు రిటైర్డ్ అయ్యారు. సమగ్రశిక్షలో పని చేస్తున్న సెక్టోరియల్ అధికారులందరినీ తప్పించారు. వారిస్థానంలో నేటికీ కొత్తవారిని తీసుకోలేదు. దీంతో విద్యాభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించేవారు లేక పథకాలన్నీ కుంటుపడ్డాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య విభేదాలతోనే నియామకాల్లో బ్రేక్ పడిందనే ప్రచారం సాగుతోంది. కనీసం కొత్త సంవత్సరంలోనైనా సెక్టోరియల్ అధికారుల నియామకం కొలిక్కి వచ్చి పేద విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి జరగాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆకాంక్షిస్తున్నారు.

నిధులు లేవు.. పనులు జరగవు..

గత ప్రభుత్వం 'నాడు–నేడు' కార్యక్రమంతో ప్రభుత్వ బడుల్లో 11 రకాల మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దింది. తొలివిడతగా జిల్లాలో 698 స్కూళ్లలో రూ. 201 కోట్లు ఖర్చు చేశారు. రెండోవిడతలో 1,079 స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేశారు. రూ. 384.67 కోట్లు కేటాయించి అందులో రూ. 190 కోట్ల దాకా ఖర్చు చేసింది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నయాపైసా కూడా విడుదల చేయలేదు. దీంతో పెండింగ్ పనులకు మోక్షం లభించడం లేదు. వాస్తవానికి చాలా స్కూళ్లలో గత ప్రభుత్వంలోనే 90 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలి ఉన్న అరకొర పనులను కూడా ఈ ప్రభుత్వం పూర్తి చేయడం లేదు. కొత్త సంవత్సరంలోనైనా ఈ పనులపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందనే ఆశతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

బంగారు, నగదు అపహరణ

గుత్తి: ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం ఓ ప్రయాణికురాలి ఆభరణాలు, నగదును దొంగలు అపహరించారు. వివరాలు..పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామానికి చెందిన భూమిక గుంతకల్లు బస్సు ఎక్కేందుకు గుత్తి బస్టాండులో వేచి ఉంది. ఇంతలో గుర్తు తెలియనివ్యక్తులు ఆమె బ్యాగులో ఉన్న జత బంగారు కమ్మలు, రూ.9 వేల నగదు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ సురేష్, ఏఎస్‌ఐలు నాగమాణిక్యం, ఆజాద్, సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని విచారించారు.

హామీలు అమలు చేయండి బాబూ


• వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షుల డిమాండ్



మాట్లాడుతున్న అనుబంధాల సంఘాల అధ్యక్షులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడుస్తున్నా..ఇంత వరకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ఇప్పటికైనా సీఎం చంద్రబాబు హామీల అమలుకు పూనుకోవాలని వైఎస్సార్ సీపీ అనుబంధాల సంఘాల జిల్లా అధ్యక్షులు డిమాండ్ చేశారు. శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, విద్యుత్ పోరుబాట కార్యక్రమంపై జిల్లాలోని టీడీపీ నాయకులు చేసిన విమర్శలను తప్పుబట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగిందన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రజలపై ఎటువంటి భారం మోపకుండా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై రూ.15,485 కోట్ల భారం పడుతుందనేత వైఎస్సార్ సీపీ అధిష్టానం విద్యుత్ పోరుబాటకు పిలుపునిచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బయట పడడంతో జీర్ణించుకోలేక కూటమి నాయకులు బెంబేలెత్తిపోతున్నారన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

భూముల్ని కాజేసేందుకు కార్పొరేట్ల కుట్ర



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

అనంతపురం అర్బన్: సోలార్, గాలిమరల పేరుతో రైతుల నుంచి భూములను కాజే సేందుకు కార్పొరేట్ కంపెనీలు కుట్ర చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ ఆరోపించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గాలిమరలు, సోలార్ ఏర్పాటుకు చిన్న, సన్నకారు రైతుల భూములు లీజు తీసుకునేందుకు కార్పొరేట్ కంపెనీల దళారులు రంగంలోకి వచ్చారన్నారు. ఎకరాకు రూ.30 వేలు ఇచ్చి 20 ఏళ్లు అగ్రిమెంట్ చేసుకుంటామని రైతులను మభ్యపెడుతున్నారన్నారు. ఈ విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. భూములను కార్పొరేట్ కంపెనీలకు 20 ఏళ్లు లీజుకు ఇచ్చిన తరువాత, ఆ పత్రాలను బ్యాంకుల్లో పెట్టి రుణాలు తీసుకుని సోలార్, గాలిమరలు ఏర్పాటు చేస్తారన్నారు. దళారులు చెప్పే మాటలకు రైతులు మోసపోయి భూములను కోల్పోవద్దని కోరారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడం సరికాదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నాయకులు టి.నారాయణస్వామి, రామకృష్ణ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఇంటి పైనుంచి పడి వ్యక్తి మృతి



మృతుడు కంబగిరి(ఫైల్)

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పోరాటకాలనీలో మద్యం మత్తులో ఇంటి పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు...పోరాటకాలనీకి చెందిన కంబగిరి(40) ఉదయం మూత్ర విసర్జన కోసం ఇంటిపైకి వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న అతడు ప్రమాదవశాత్తూ పై నుంచి కిందపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య హేమావతి, పిల్లలు రక్షిత, కార్తిక్ ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దళారుల మాటలు నమ్మొద్దు



దేహదారుఢ్య పరీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ కల్పించే దళారుల మాటలు నమ్మవద్దని జిల్లా ఎస్పీ పి. జగదీష్ పేర్కొన్నారు. శనివారం ఆయన పీటీసీ మైదానంలో ఈనెల 30 నుంచి జనవరి 17 వరకూ జరిగే పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించి దేహ దారుఢ్య పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేహ దారుఢ్య పరీక్షల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టమన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుండడంతో ఎక్కడా అక్రమాలకు తావుండదనే విషయాన్ని గుర్తించాలని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను ఎవరైనా మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉదయం 5 గంటలకే హాజరుకావాలి

ఈ నెల 30 నుంచి జనవరి 17వ తేదీ వరకు జరిగే దేహ దారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులో నిర్దేశించిన తేదీల్లో ఉదయం 5 గంటలకు నీలం సంజీవరెడ్డి మైదానంలో హాజరుకావాలి. తమతో పాటు అడ్మిట్ కార్డు, స్టేజ్ -1, స్టేజ్-2 అప్లికేషన్ కాపీలు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకరావడంతో పాటు ఒక సెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలను తమ వెంట తెచ్చుకోవాలి. ఈవెంట్స్ ఉన్న అభ్యర్థులు ఆయా నిర్దేశిత తేదీలో అనంతపురం పీటీసీ తూర్పు గేటు నుంచి ప్రవేశించాలి.

- అభ్యర్థులతో పాటు తమ వెంట ఎవరైనా వచ్చినా..పీటీసీ తూర్పున ఉన్న రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు ప్రారంభమయ్యే పాయింట్ వద్ద ఆగిపోవాలి. ఈవెంట్స్ జరిగే ప్రదేశానికి అనుమతి ఉండదు. అభ్యర్థికి మాత్రమే ఈవెంట్స్ ప్రదేశానికి రావాల్సి ఉంటుంది.

ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలి

- ఈ నెల 30వ తేదీ తెల్లవారుజామున 4 గంటల నుంచి జనవరి 17వ తేదీ వరకు పీటీసీ తూర్పున ఉన్న రైల్వే ట్రాక్‌కు అనుకుని ఉన్న రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. ఎలాంటి రాకపోకలు ఉండవు. ఈవెంట్స్ ముగిసే వరకు జరిగే అన్ని రోజుల్లోనూ పోలీసులు ఈ ఆంక్షలు అమలు చేస్తారు.
- రాంనగర్, లక్ష్మి నగర్ మిట్టల మీదుగా మొదటి, రెండు, మూడు తదితర రోడ్లకు వెళ్లే వాహనదారులు లక్ష్మి నగర్ నాగులకట్ట నుంచి సంజీవరెడ్డి బిల్డింగ్ సర్కిల్, జన్మభూమి రోడ్డు మీదుగా వెళ్లాలి.
- మొదటి, రెండు, మూడు, తదితర రోడ్ల నుంచి రాంనగర్, లక్ష్మినగర్, రహమత్ నగర్ రైల్వే బ్రిడ్జి వైపు వెళ్లే వాహనదారులు పీటీసీ ఉత్తరం వైపు ఉన్న సర్వీసు రోడ్డు ద్వారా నడిమివంక, జన్మభూమి రోడ్డు, సంజీవరెడ్డి బిల్డింగ్ సర్కిల్‌మీదుగా లక్ష్మినగర్ నాగులకట్ట నుంచి వెళ్లాలి.

విద్యుత్ తీగ తెగిపడి పాడి గేదెల మృతి

మడకశిరరూరల్: సిద్దగిరి గ్రామ సమీపంలో శనివారం 11 కేవీ విద్యుత్ వైరు తెగి పడి రెండు పాడి గేదెలు మృతి చెందాయి. వివరాలు..గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసరెడ్డి తన గేదెలను మేతకోసం తోలుకెళ్లాడు. గేదలు మేత మేస్తుండగా ఒక్కసారిగా 11 కేవీ విద్యుత్ వైరు తెగి వాటి మీద పడింది. దీంతో రెండు గేదెలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాయి. 50 మీటర్ల వరకూ విద్యుత్ తీగ కాలిపోయింది. ఘటనలో రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ ఏఈ విశ్వనాథ్, లైన్‌మ్యాన్ బాలకృష్ణ ఘటన స్థలంతోపాటు మృతి చెందిన గేదెలను పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి పరిహారం కోసం ఉన్నత అధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. సబ్‌స్టేషన్‌కు వెళ్లి ఎందుకు బ్రేక్ డౌన్ కాలేదని ఆరా తీశారు.



మృతి చెందిన గేదెలు

గోమాతకు సీమంతం



గోమాతకు సీమంతం చేస్తున్న వెంగమనాయుడు దంపతులు

బత్తలపల్లి: గోమాతను హిందువులు పవిత్రంగా పూజిస్తుంటారు. ఈ క్రమంలోనే శనివారం బత్తలపల్లిలో చెరుకూరి వెంగమనాయుడు దంపతులు(పోస్టల్ నాయుడు) తమ ఇంట పెంచుకుంటున్న గోమాతకు సీమంతం నిర్వహించారు. ఏడు నెలల తొలిచూరి గర్భంతో ఉన్న గోమాతను ఇంటి ఆడపడుచుగా భావించి ఘనంగా సీమంతం చేశారు. బంధువులు, స్నేహితుల సమక్షంలో వేదపండితులు మంజునాథ శర్మచే పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు నిర్వహించే విధంగానే గోమాతకు కూడా పసుపు, కుంకుమ, పుష్పాలతో పాటు నూతన దుస్తులను సమర్పించారు. అతిథులకు అన్నదానం చేశారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి వేడుకలు



బాలయోగి ఆశ్రమంలో శనేశ్వరుడికి పూజలు చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: శనిత్రయోదశి వేడుకలు శనివారం నగరంలో పలు చోట్ల ఘనంగా జరిగాయి. స్థానిక శివ బాలయోగి ఆశ్రమం, మొదటిరోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వరాలయం, శివకోటి, శంకరమఠం, హెచ్చెల్సీకాలనీ శ్రీ మంజునాథేశ్వరాలయం తదితర చోట్ల శనేశ్వరస్వామికి పెద్ద ఎత్తున తైలాభిషేకాలు, రుద్ర పూజలు, అర్చనలు, అలంకార సేవలు జరిగాయి. దోషనివారణ పూజల్లో వందల మంది భక్తులు పాల్గొని స్వామివారిని ఆరాధించుకున్నారు. స్వయంగా తైలాభిషేకం నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించడంతో భక్తులు బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం తీర్థప్రసాద వినియోగం, నారాయణ సేవ కార్యక్రమాలు జరిగాయి.

ఏఐవైఎఫ్ 'రాప్తాడు' కమిటీ ఎన్నిక

అనంతపురం అర్బన్: ఏఐవైఎఫ్ రాప్తాడు నియోజకవర్గ నూతన కమిటీని శనివారం అనంతపురంలోని సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షునిగా హరీష్, ఉపాధ్యక్షులుగా మధు, గురుమోహన్, మణికంఠ, ప్రధాన కార్యదర్శిగా ధనుంజయ, సహాయక కార్యదర్శులు శ్యామ్‌ప్రసాద్, వంశీ, చందుతో పాటు 15 మంది కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి మల్లికార్జున, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మహిళలకు సూచనలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య

ఆత్మకూరు: స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌పీ పీడీ ఈశ్వరయ్య సూచించారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు బ్యాంకు రుణాలు తీసుకొని వ్యాపారాలు చేస్తూ, పాడి పరిశ్రమల్లో అధికా లాభాలు పొంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. తీసుకున్న రుణాలు సకాలంలో కట్టాలని దిశా నిర్దేశం చేశారు. వ్యాపారాలు చేసే మహిళలకు రుణాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించరాదని వెలుగు సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో డీపీఎం ఫైనాన్స్ సత్యనారాయణ, ఏపీఎమ్ పద్మావతి, ఏరియా కోఆర్డినేటర్ సుభద్రమ్మ, సీసీలు వెంకటనారాయణ, శ్రీరాములు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఐఎన్‌టీఎస్‌ఓ' ఫలితాల్లో 'శ్రీ చైతన్య' విద్యార్థుల ప్రతిభ



రెండోదశకు ఎంపికైన విద్యార్థులతో ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: గత నవంబర్ 11, 13 తేదీల్లో నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (ఐఎన్‌టీఎస్‌ఓ) తొలి రౌండ్ పరీక్ష ఫలితాల్లో అనంతపురం జోన్‌కు చెందిన శ్రీ చైతన్య పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. శనివారం స్థానిక కమ్మ భవన్ సమీపంలోని శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో వారికి అభినందన సభ నిర్వహించారు. ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థల నుంచి 7,455 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా, 6,345 మంది రెండోదశకు అర్హత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కోఆర్డినేటర్లు, డీన్లు, ఒలంపియాడ్ పరీక్షల ఇన్‌చార్జ్‌లు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మాలల యుద్ధ గర్జన'కు తరలిరండి

అనంతపురం టవర్‌క్లాక్: మాల జేఏసీ (జాక్) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 23న నిర్వహించనున్న 'రాయలసీమ మాలల యుద్ధ గర్జన' సభకు తరలిరావాలని జేఏసీ నాయకులు యాట ఓబులేసు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో మాల జేఏసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాట ఓబులేసు మాట్లాడుతూ కర్నూలులోని ఎస్‌టీబీసీ మైదానంలో సభ నిర్వహిస్తామన్నారు. మాల ఉద్యోగులు, మేధావులు, యువకులు, సీనియర్ నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాధవ స్వామి, ఓబులేసు, సుందరబాబు, కోట్ల గంగాధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చేయకపోతే ఎలా?

- మేం ప్రజాప్రతినిధులుగా ఉండీ ప్రయోజనం ఏంటి?
- అధికారులను నిలదీసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు





సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై మండిపడుతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్

రాప్తాడురూరల్: 'ప్రజల అవసరాలు తీర్చలేనప్పుడు మేం ప్రజాప్రతినిధులుగా ఉండీ ఏమి ప్రయోజనం. చేసిన పనులకు బిల్లులు చేయకపోతే ఎలా? చేతి నుంచి డబ్బు పెట్టుకున్నాం. పంచాయతీల్లో డబ్బు ఉండి కూడా బిల్లులు చేయడం లేదు' అంటూ ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. శనివారం అనంతపురం రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో ఎంపీపీ వరలక్ష్మీ అధ్యక్షతన జరిగింది. రాచానపల్లి సర్పంచ్ బండా అంజి యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు గౌస్, రాజీవ్‌కాలనీ సర్పంచ్ ఆశాబీ మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం వివిధ పనులు చేశామని, బిల్లులు చేయకుండా కార్యదర్శులు ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. చేసిన పనులకు బిల్లులు చేస్తే మరిన్ని పనులు చేసే వీలుంటుందన్నారు. నిధులు ఉండి కూడా బిల్లులు చేయకపోవడమేంటని మండిపడ్డారు. పంచాయతీల్లోఅభివృద్ధి పనులు చేయకపోతే గెలిపించిన ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఎంపీడీఓ దివాకర్ మాట్లాడుతూ ఆయా కార్యదర్శులతో మాట్లాడి బిల్లులు పెండింగ్ పెట్టకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

ప్రజాప్రతినిధులకు అవమానం..

గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో ప్రోటోకాల్ పాటించకుండా స్థానిక ప్రజాప్రతినిధులను అవమానపరుస్తున్నారంటూ జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలాచోట్ల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు కనీసం సమాచారం ఇవ్వడం లేదన్నారు. సమాచారం తెలుసుకుని సదస్సులకు హాజరైనా గౌరవం ఇవ్వడం లేదన్నారు. వేదికపై కుర్చీలు కూడా వేయడం లేదన్నారు. ఎలాంటి హోదా లేని టీడీపీ కార్యకర్తలను కూర్చోబెట్టుకుంటున్నారన్నారు. ఇదేనా రెవెన్యూ అధికారులు పాటించే ప్రోటోకాల్? అని మండిపడ్డారు.

మెటీరియల్ ఎత్తుకెళ్తున్నా కనిపించలేదా?

కొడిమి లేఔట్‌లో ప్రభుత్వ సొమ్ముతో సమకూర్చిన ఇసుక, కడ్డీలు, సిమెంట్ పెల్లలు, సిమెంట్ బస్తాలు ఎత్తుకెళ్తున్నా అధికారులకు కనీసం కనిపించలేదా? అని జెడ్పీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సొమ్ముకే దిక్కులేకపోతే ఎలా అంటూ మండిపడ్డారు. పట్టపగలే ఎత్తుకెళ్తున్నట్లు ఆధారాలతో సహా పత్రికల్లో ప్రచురితమైనా సంబంధిత అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకోకపోతే ప్రజల్లోకి ఎలాంటి సందేశం వెళ్తుందో అర్థం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంఈఓ వెంకటస్వామి, అగ్రికల్చర్ ఏఓ శశికళ, మండల వైద్యాధికారి, ఏపీఎం పాల్గొన్నారు.

సిద్ధి గణపతి యాగాలు ప్రారంభం



హోమాలను నిర్వహిస్తున్న శ్రీపీఠం ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మిక భావజాలాన్ని పెంచుతూ రెండు రోజుల పాటు సాగనున్న సిద్ధిగణపతి యాగాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జ్ఞానపీఠం, గుహానందమండలి సంయుక్త ఆధ్వర్యంలో విద్యానందనాథ స్వామీజీ, ఆధ్యాత్మికవేత్త గోటేటి శ్రీనివాసరావు నేతృత్వంలో 50 మంది శిష్యులతో కలిసి యాగాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన హోమం ఆదివారం సాయంత్రం వరకు నిర్విరామంగా మూలమంత్రాలతో సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. రెండో రోడ్డులోని జ్ఞానపీఠం ఆశ్రమంలో ఉదయం గణపతి పూజతో ప్రారంభించి మహా సంకల్పం, కలశస్థాపన, గణపతి ఆవరణార్చన, సహస్రాన్వృత అధర్వశీర్ష పారాయణ సహితంగా హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం నిర్వాహకులు మాట్లాడుతూ సనాతన ధర్మంలో భాగంగా లోక క్షేమం కోసం యాగాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం గణపతి మూల మంత్రాన్ని నిర్విరామంగా జపిస్తూ అష్టద్రవ్యాలతో హోమం సాగుతుందన్నారు. అలాగే వాంఛా కల్పలత గణపతి హోమం, ప్రత్యక్ష అష్టగణపతి పూజ, మహా పూర్ణాహుతి జరుగుతాయని, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

'హెచ్చరిక బోర్డు' తిరిగొచ్చింది!



సర్వే నంబరు 235-2లోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ 235-2 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు మళ్లీ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 235-2 సర్వే నంబరులోని రెండెకరాల ప్రభుత్వ భూమిలో కొందరు టీడీపీ చోటా నాయకులు లేఔట్ వేసి అడ్డగోలుగా అమ్మకాలకు సిద్ధం చేసిన వైనంపై 'సాక్షి'లో ఇటీవల 'ప్రభుత్వ భూమి...ప్రైవేట్ లేఔట్!' శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. దీనిపై కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించి రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ మోహన్‌కుమార్ ఆదేశాలతో ఈ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్లాట్లుగా విభజించి నాటిన రాళ్లను తొలగించారు. ఇది ప్రభుత్వ భూమి అని, ఎవరైనా అమ్మినా, కొనుగోలు చేసినా, నిర్మాణాలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అయితే.. ఐదు రోజుల కిందట హెచ్చరిక బోర్డును మాయం చేశారు. ఈ భూమిపై కన్నేసిన టీడీపీ చోటా నాయకుల పనా? లేదంటే ఎవరైనా దొంగలు ఎత్తుకెళ్లారా అనేది తేలాల్సి ఉంది. దీనిపై 'సాక్షి'లో శుక్రవారం 'బోర్డు మాయం చేసేశారు..!' శీర్షికతో కథనం వెలువడింది. దీంతో తహసీల్దార్ స్పందించి బోర్డు మాయం చేసిన వారిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని వీఆర్‌ఓను ఆదేశించారు. ఆ స్థానంలో వెంటనే బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో ఆగమేఘాలపై మరో బోర్డు ఏర్పాటు చేశారు. ఈసారి బోర్డును ఎవరైనా తొలగిస్తే సీరియస్‌గా పరిగణిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

సాక్షి ఎఫెక్ట్..

బోర్డులో పేర్లు సరిచేశారు

రాప్తాడు: మరూరు సచివాలయం వద్ద సమాచార హక్కు చట్టం బోర్డులో అధికారుల పేర్లను ఎట్టకేలకు సరిచేశారు. ఇక్కడ అధికారులు మారిపోయినా వారి పేర్లు మార్చకుండా బోర్డును అలాగే ఉంచారు. ఈఓఆర్డీగా మాధవి అని ఉంది. ఆమె రెండేళ్ల క్రితమే బదిలీపై వేరొక ప్రాంతానికి వెళ్లారు. ఎంపీడీఓగా సాల్మన్, పంచాయతీ కార్యదర్శిగా వరలక్ష్మీ అని ఉంది. ఇద్దరు అధికారులు సాధారణ బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఈ క్రమంలో 'సమాచారం మార్చరా' అనే శీర్షికన ఈ నెల 24న సాక్షి దినపత్రిలో కథనం ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి శైలజ శనివారం స్పందించి బోర్డులో పేర్లు మార్పించారు. ఈఓఆర్డీ మాధవి బదులు ఆనంద్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి బదులు శైలజ, ఎంపీడీఓ సాల్మన్ బదులు విజయలక్ష్మి పేర్లు పొందుపరిచారు.

ఆర్మీ లిక్కర్ స్వాధీనం

అనంతపురం: నగరంలోని అశోక్‌నగర్‌లో ఓ వ్యక్తి ఇంట్లో 42 ఫుల్‌బాటిల్ డిఫెన్స్ లిక్కర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐలు జయ నరసింహా, జాకీర్ హుస్సేన్, కృష్ణా రెడ్డి తెలిపారు. నూతన సంవత్సర వేడుకలకు మద్యం బాటిళ్లు తెప్పించినట్లు విచారణలో తేలింది. ఈ మద్యం బాటిళ్లు ఎక్కడ నుంచి వచ్చాయి అనే దానిపై విచారణ సాగుతోందని పేర్కొన్నారు.

- ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో అనంతపురం పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలోని భాగ్యనగర్ 11వ క్రాస్ వద్ద ఓ వ్యక్తి వద్ద నుంచి 59 ఫుల్‌బాటిళ్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రస్తా సమస్యలపై ఏకరువు



రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న అనంతపురం ఆర్డీఓ కేశవ నాయుడు

రాప్తాడు: హంపాపురంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు ఆకస్మికంగా తనిఖీ చేసి అర్జీలను పరిశీలించారు. చాలామంది రైతులు రస్తా సమస్యలపై ఏకరువు పెట్టారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ వ్యవసాయ భూమిలో ఇతర రైతులకు రస్తా లేదని చెప్పే హక్కు ఎవ్వరికీ లేదన్నారు. 12 అడుగుల రస్తా వదలాల్సిందేనని స్పష్టం చేశారు. అలా ఎవరైనా రస్తా ఇవ్వకుంటే తమకు ఫిర్యాదు చేస్తే చట్ట పరంగా 12 అడుగులు రస్తా ఇచ్చేలా చూస్తామన్నారు. సర్వేనంబర్ 226లో ఉన్న 3.62 ఎకరాల యలమకూరి ఆంజనేయస్వామి ఆలయ మాన్యాన్ని కూడేరు మండలం ఇప్పేరుకు చెందిన మాజీ నక్సలైట్ యల్లన్న అలియాస్ నాగరాజు ఆన్‌లైన్‌లో తనపేరిట బదలాయించుకున్నాడని గ్రామస్తులు ఎంపీటీసీ రవి, జయప్ప, సోమశేఖర్ నాయుడు, ప్రతాప్ చౌదరి, ఆదెప్ప, సీతారాముడు తదితరులు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. నాగరాజుకు ఇప్పేరులో ప్రభుత్వ భూమి ఉందని తెలియజేశారు. ఆన్‌లైన్‌లో అక్రమంగా ఎక్కించుకున్న మాన్యం భూమిని తిరిగి ఆలయం పేరుపైకి మార్చాలని కోరారు. ఆర్డీఓ స్పందిస్తూ రికార్డులు పరిశీలించి దేవుని మాన్యం భూమి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ విజయకుమారిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాగే కరుణాకర్, సర్వేయర్ రామాంజనేయులు, వీఆర్వో శిరీషా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విలక్షణ నటుడు నారాయణస్వామి



రాయబారం పద్యనాటకంలో ఓ దృశ్యం

అనంతపురం కల్చరల్: అనంత రంగస్థలానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టిన రంగస్థల కళా దిగ్గజం గాజుల నారాయణస్వామి విలక్షణ నటుడని నాటక అకాడమీ చైర్మన్, ప్రసిద్ధ రంగస్థల కళాకారుడు గుమ్మడి గోపాల కృష్ణ అన్నారు. ఎల్కేపీ మాజీ కార్యదర్శి దివంగత గాజుల నారాయణస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన స్మారకార్థం శనివారం రాత్రి 'శ్రీకృష్ణ రాయబారం' పద్య నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా నారాయణ స్వామికి ఘనంగా నివాళులర్పించారు. ఎల్కేపీ కార్యదర్శి పద్మజ నేతృత్వంలో జరిగిన నారాయణస్వామి స్మారక సమావేశంలో గుమ్మడి గోపాల కృష్ణ మాట్లాడుతూ నారాయణస్వామి నటించిన సతీసావిత్రి నాటకం వల్లనే అనంత నాటకానికి నంది అవార్డులొచ్చాయని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కర్నూలు కళాక్షేత్రం నిర్వాహకులు ఓబుళపతి, ఎల్కేపీ కళాకారులతో పాటు లలితకళా పరిషత్తు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై పోరాడాలి



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సంధ్యారాణి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అంగన్‌వాడీ సమస్యలపై పోరాడాలని, ఎప్పటికప్పుడు వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. శనివారం 'అనంత'ను ఆయన నివాసంలో సంధ్యారాణి మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో కీలక పాత్ర పోషించాలని 'అనంత' ఆమెకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అనంతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఓబిరెడ్డి

ట్రేడ్ యూనియన్‌ను బలోపేతం చేయాలి

జిల్లాలో ట్రేడ్ యూనియన్‌ను బలోపేతం చేసి, కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పార్టీ ట్రేడ్ యూనియన్ నాయకులకు సూచించారు. శనివారం ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, ఇతర నాయకులతో అనంత మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ కార్మిక శ్రేయస్సును కాంక్షించే పార్టీ అని తెలిపారు. నాయకులు నిత్యం ప్రజల్లో ఉంటూ సేవలందించాలని సూచించారు. ఓబిరెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంపంగి రామాంజినేయులు, కమల్‌భూషణ్, సైఫుల్లాబేగ్, నరసింహులు, నాయకులు కొర్రపాడు హుస్సేన్ పీరా, చిరంజీవి, బెస్త తిరుపాల్, మహేష్, సతీష్, దివాంజీ, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్, డైరీని ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన 2025 కేలండర్, డైరీని శనివారం యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, నాగేంద్ర చేతుల మీదుగా ఆవిష్కరించారు. స్థానిక ఉపాధ్యాయ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రభుత్వంతో పోరాడి సాధించుకోవాల్సిన విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలు చాలా ఉన్నాయన్నారు. సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేసేదాకా పోరాటం కొనసాగిస్తామన్నారు. అన్ని రకాల సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ 45 సంవత్సరాలుగా యూటీఎఫ్ డైరీ, జీఓ పుస్తకం ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, నాయకులు శ్రీనివాసులు, వెంకటనాయుడు, ఆదిశేషయ్య, కొండప్ప, రమేష్, వీరుపాక్షి పాల్గొన్నారు.

నాగేంద్ర సేవలు ప్రశంసనీయం

- వీడ్కోలు సభలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ



వీడ్కోలు సభలో ఏఓ నాగేంద్రను సన్మానిస్తున్న జేడీఏ, ఎస్‌టీఎల్ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: దశాబ్దాల పాటు వ్యవసాయ అధికారి (ఏఓ)గా వివిధ మండలాల్లో, ప్రస్తుత భూసార పరీక్షా కేంద్రం (ఎస్‌టీఎల్) ఏఓ నాగేంద్ర రైతు సేవకు అంకితమై పనిచేశారని జేడీఏ ఉమామహేశ్వరమ్మ కొనియాడారు. శనివారం స్థానిక కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న ఏఓ నాగేంద్రను సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. వివిధ మండలాల్లో ఏఓగా పనిచేస్తూ ప్రభుత్వం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వివిధ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి రైతులకు వాటి ఫలాలు అందించారని గుర్తు చేశారు. శేష జీవితం కుటుంబ సభ్యులతో హాయిగా గడవాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. పుష్పగుచ్ఛాలు, శాలువ, మెమెంటో అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏడీఏలు ఎం.రవి, పుష్పలత, అసోసియేషన్ నాయకులు వెంకటకుమార్, వాసుప్రకాష్, భూసార పరీక్షా కేంద్రం (ఎస్‌టీఎల్) ఏఓలు శ్రీనాథరెడ్డి, అర్చన, ఉమా మహేశ్వరి, డివిజన్ ఏడీఏలు, ఏఓలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శస్త్రచికిత్సలపై శిక్షణ



సమాచారాన్ని తెలుసుకుంటున్న విద్యార్థులు, చిత్రంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం మెడికల్: ప్రముఖ జాన్సన్ అండ్ జాన్సన్ ఇన్‌స్టిట్యూట్ వారి సౌజన్యంతో రూ.2 కోట్లతో ఏర్పాటు చేసిన బస్సు శనివారం అనంతపురం వైద్య కళాశాలకు చేరుకుంది. ఎండోస్కోపీ, లాప్రోస్కోప్ సర్జరీలను అత్యాధునిక పద్ధతుల్లో ఏ విధంగా చేస్తారని చిత్ర ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు మాట్లాడుతూ నూతన వైద్య చికిత్సలపై అవగాహన కల్గి ఉండడం చాలా అవసరమన్నారు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలను అందుబాటులో తీసుకురావడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో రెండు రోజుల పాటు బస్సు ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ ఆత్మరాం, డాక్టర్ శంకర్ నాయక్, డాక్టర్ ఉమామహేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు, జాన్సన్ అండ్ జాన్సన్ శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

అనంతపురం రూరల్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఎలాంటి అసౌకర్యాలూ తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో దేవదాయ, పోలీసు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు.

వదలని వర్షాలు.. అన్నదాత కుదేలు

- పంటను కాపాడుకునేందుకు అగచాట్లు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



లింగనపల్లి సమీపంలో ధాన్యాలపై పట్ట కప్పిన దృశ్యం



ధాన్యాన్ని సంచుల్లో నింపుతున్న రైతులు

రాప్తాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాతలు కుదేలవుతున్నారు. పొలాల్లో, కల్లాల్లో ధాన్యం తడిచిపోవడంతో గుండె చెరువవుతోంది. పలుచోట్ల కోతలు కోయకుండా ఉన్న పొలంలో నీరు చేరడంతో పంట కుళ్లిపోయింది. మరి కొన్ని ప్రాంతాల్లో ధాన్యం తడిచిపోవడం, తేమ శాతం పెరిగిపోవడంతో మొలకలు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. ఈ రబీలో వరితో పాటు మొక్కజొన్న, టమాట, వేరుశనగ, పెసర, అలసంద పంటలకు కూడా నష్టం తప్పటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తప్పని ఇబ్బందులు

ఈ రబీలో మండల వ్యాప్తంగా వరి 10 హెక్టార్లు, వేరుశనగ 165, మొక్కజొన్న 65, టమాట 34, అలసంద 5, పెసర 5, ఉలవ 135, జొన్న 5 హెక్టార్లలో సాగయ్యాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరిచేను కోతలు పూర్తయ్యాయి. కొందరు రైతులు పంట పొలంలోనే వరి కుప్పలు పెట్టారు. మరోవైపు యంత్రాల ద్వారా కోత కోసిన రైతులు ధాన్యం బస్తాలను పొలం గట్లు, సమీపంలోని చెరువుగట్లు, జాతీయ రహదారులపై ఆరబెట్టారు. వర్షాలు పడడంతో పొలంలో కుప్పలు, ధాన్యం బస్తాలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి, మొక్క జొన్న పంటలు తడవకుండా టార్పాలిన్ పట్టలు కప్పి ఉంచారు. రోజులతరబడి అలాగే ఉంచితే వరి మొలకలు వస్తుందని, మొక్క జొన్న దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి. ఆరుతడి పంటలకు ప్రత్యేక నష్టపరిహారం ఇవ్వాలి. తేమ శాతం ధాన్యానికి ప్రధాన సమస్యగా ఉంది. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులకు ఇబ్బందులు తప్పవు.

– కేశవయ్య, రైతు, ఎం.చెర్లోపల్లి, రాప్తాడు మండలం

ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి



నవంబర్ చివరి వారం నుంచి అకాల వర్షాలు, తుపాన్లు కొనసాగుతున్నాయి. తుపాను ఉన్నా దేవుడిపై భారం వేసి ప్రస్తుతం ఎకరా పొలంలో వరి పంట కోశాం. గత నాలుగు రోజుల నుంచి చిరు జల్లులు కురుస్తున్నాయి. ప్రస్తుతం పండిన అరకొర పంట చేతికి రాకుండా వర్షాలు వెంటాడుతున్నాయి. తేమ శాతం ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

–సంజీవరెడ్డి, రైతు, హంపాపురం, రాప్తాడు మండలం